విద్యుత్ సమస్యకు పరిష్కారం

మాన్యగూడలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కందుకూరు, ఫిబ్రవరి 6 : సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నేదునూరు గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం మాన్యగూడలో విద్యుత్ సమస్య నెలకొని తాగునీటికి ఇబ్బంది కలుగడంతో వెంటనే విద్యుత్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డిని సంప్రదించి సమస్య పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు ఇబ్బందులు పడకుండా సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ఏఈతో పాటు సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్ భేగ్, పంచాయతీ కార్యదర్శి రాకేశ్‌గౌడ్, లైన్‌మెన్ నర్సింహ, బొర్ర సురేశ్, వరికుప్పల బాబు, నారమోని యాదయ్య, నర్సింహ, ఎగిరిశెట్టి యాదయ్య, రాజు, భిక్షపతి, యాదయ్య, అయ్యూబ్ బేగ్ పాల్గొన్నారు.

జనరేటర్ ప్రారంభం

బడంగ్‌పేట,ఫిబ్రవరి 6: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నూతనంగా రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన జనరేటర్‌ను గురువారం కమిషనర్ సరస్వతి ప్రారంభించారు. వేసవి కాలంలో విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు జనరేటర్ ద్వారా విద్యుత్ సరఫరా చేయడానికి ఉపయోగ పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. కరెంటు పోయిన సమయంలో విద్యుత్ లేక పోవడం వలన పనులు చేయడానికి అంతరాయం ఏర్పడుతుందన్నారు. కరెంటు వచ్చి పోవడం వలన కంప్యూటర్లు చెడిపోవడం జరుగుతుందన్నారు. అందుకని జనరేటర్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఈ జ్యోతి, ఏఈ వినీల్ గౌడ్ ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పీర్జాదిగూడ, ఫిబ్రవరి 6: మేడిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి బుద్ధానగర్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్ నగర్‌కాలనీ, మల్లికార్జున్‌నగర్‌కాలనీతో పాటు వరంగల్ జాతీయ ప్రధాన రహదారిలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ హరినాథ్ తెలిపారు.

రాయల్ కాలనీలో సమస్యల తిష్ట

రాయల్ కాలనీలో రోడ్డుపై పేరుకు పోయిన చెత్త

బడంగ్‌పేట, ఫిబ్రవరి 6: పేరుకే రాయల్ కాలనీ. కాలనీలలో ఎక్కడ చూసినా సమస్యల తిష్ట. అస్తవ్యస్తమైన రోడ్లు, మురుగు నీరు రోడ్ల పై పారుతున్న దృశ్యాలు దర్శనమిస్తాయి. పారిశుధ్యం లోపించింది. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రాయల్ కాలనీలో రోడ్లపైనా, కాలనీలలో ఎక్కడ చూసిన చెత్త కుప్పలు దర్శన మిస్తున్నాయి. ఈ కాలనీలవైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్త కుప్పలలో జంతు కళేభరాలతో దుర్వాసన వెదజల్లుతుంది. పారిశుధ్యం లోపించడం వలన వివి ధ రకాల రోగాలు వస్తాయని తెలిసిన అధికారులు పట్టించుకోవడంల లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పారిశుధ్యం లోపిస్తే మలేరియా, చికెన్ గున్యా, కలరా వంటి వ్యాధులు వస్తాయని తెలిసిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

బీఈ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని విభాగాల బీఈ కోర్సుల పరీక్ష తేదీలను వాయిదా వేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల బీఈ (ఏఐసీటీఈ), బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) పరీక్షలను ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించాలని గతంలో ప్రకటించినప్పటికీ సాంకేతిక కారణాల రీత్యా వాటిని వాయిదా వేసినట్లు చెప్పారు. పరీక్షలను తిరిగి వచ్చే నెల 5వ తేదీ నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రం, పరీక్ష సమయాల్లో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

అక్రమ భవనాన్ని కూల్చి వేస్తున్న ఎల్బీనగర్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్ బృందం

చంపాపేట, ఫిబ్రవరి 6: జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ నంబర్-4, లింగోజిగూడ డివిజన్ పరిధి చంపాపేట నుంచి కర్మన్‌ఘాట్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన, మెగా ఫంక్షన్‌హాల్ ఎదురుగా ఎన్ విలేజీ హోటల్ సమీపంలో సుమారు 1215 చదరపు గజాల స్థలంలో కొంత కాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా కొంత మంది వ్యక్తులు సిండికేట్ అయ్యి నిర్మించిన గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణాలను గురువారం టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్ బృందం ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రతాప్ మాట్లాడుతూ అక్రమంగా నిర్మించిన భవన నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆదేశాల మేరకు కూల్చి వేస్తున్నట్లు తెలిపారు. అక్రమ నిర్మాణాలు ఎక్కడ కొనసాగుతున్న ఉపేక్షించేది లేదని వాటిని తప్పకుండా కూల్చి వేస్తామని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలు చేపట్టి నష్ట పోవద్దని సూచించారు. అక్రమ కట్టడాల వెనుక ఎంతటి వారున్నా కొంత సమయం ఆలస్యమైనా కూల్చి వేయడం మాత్రం ఖాయమని అక్రమ నిర్మాణదారులు గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ విభాగం చైన్‌మెన్‌లు జ్ఞానేశ్వర్, యాదగిరి పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాల కబ్జా చూపాలి

స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీవో, తహసీల్దార్, సీపీఎం నాయకులు

కందుకూరు, ఫిబ్రవరి 6 : ఇండ్ల స్థలాల కబ్జా చూపాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. మండల పార్టీ కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్, మాజీ కార్యాదర్శులు శ్రీనివాస్, కుమార్ బాధితులతో కలిసి మాట్లాడారు. కందుకూరు రెవెన్యూ పరిధిలోని 788,183సర్వే నంబర్లలో పట్టాలు ఇచ్చి కబ్జాను చూపలేదని దీంతో బాధితులు గుడిసెలు వేసుకుంటే పోలీసులు కూల్చివేశారని బాధితులకు న్యాయం చేయాలని పలుమార్లు విన్నవించిన ప్రయోజనం లేదని అన్నారు. ఆర్డీవో జోక్యం చేసుకొని కబ్జాను చూపాలని ధర్నాకు దిగారు. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి కార్యాలయంలో లేకపోవడంతో సీపీఎం నాయకులు బాధితులతో కలిసి వంటా వార్పు చేసి సహపంక్తి భోజనం చేశారు. ఆయన వచ్చే వరకు వెళ్లేదేలేదని భీష్మించుకు కూర్చున్నారు. ఆర్డీవో రావడంతో కబ్జా చూపాలని పట్టుబట్టారు. దీంతో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్ స్థల పరిశీలన చేశారు. రాళ్లు ఉన్నాయని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి, రాళ్లను తొలగించి లేఅవుట్ చేసి బాధితులకు కబ్జా చూపడానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. దీంతో బాధితులు ఆందోళన విరమించారు. మండల కమిటీ సభ్యులు గౌర శ్రీశైలం, సిద్ధం అంజయ్య, సిద్ధు, చరణ్, అరుణ, ఇందిరమ్మ, జంగమ్మ, ప్రమీల, రాణి, అలివేలు, శోభ, స్వప్న, రామ లక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి కార్ల అద్దాల బ్లాక్ ఫిలింల తొలగింపు

మలక్‌పేట, ఫిబ్రవరి 6: హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి కార్ల అద్దాలకు అంటించుకున్న బ్లాక్ ఫిలిం(టింటెడ్ గ్లాస్)ల తొలగింపుపై మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ రాము తెలిపారు. గతంలో జరిగిన అనేక సంఘటనల నేపథ్యంలో ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ నేతృత్వంలో బ్లాక్ ఫిలింల తొలగింపుపై స్పెషల్ డ్రైవ్ జరుగనుందని ఆయన తెలిపారు. భారతీయ చట్టాల ప్రకారం కారు కిటికీలు, ముందు, వెనుక అద్దాలకు కనీసం 70 శాతం, సైడ్ గ్లాసులకు 50 దృశ్యమానత కలిగి ఉండాలని ఆయన తెలిపారు. ఈ స్థాయి కంటే దృశ్యమానతను తగ్గించేవిధంగా కిటికీలకు ఏమి మార్పులు చేసినా అది చట్టవిరుద్ధంగా పరిగణించనున్నట్లు ఆయన వివరించారు. ఆర్టీవో అనుమతి లేకుండా టింటెడ్ గ్లాస్‌ను ఉపయోగించటం నేరమని, అందుకు రూ.100 జరిమానా విధించనున్నట్లు ఆయన తెలిపారు. చాలామంది వేడిని, కాంతి ప్రసరణను తగ్గించేందుకు, గోప్యతను పెంచేందుకు, వాహనం రూపాన్ని మెరుగుపరుచుకోవటం కోసం టింటెడ్ గ్లాస్‌ను వాడుతారని, అయితే దేశంలో టింటెడ్ గ్లాస్ వాడకాన్ని నిషేధించటం జరిగిందని ఆయన తెలిపారు. బ్లాక్ ఫిలిం వాడకం సెక్యూరిటీ దృష్ట్యా కేవలం వీవీఐపీలకు మాత్రమే అనుమతి ఉందని, సామాన్య ప్రజలు ఎవరూ వాడటానికి వీలులేదని ఆయన తెలిపారు. బ్లాక్ ఫిలిం కలిగిన వాహనదారులు వెంటనే వాటిని తొలగించుకోవాలని ఆయన సూచించారు. డ్రైవ్‌లో పట్టుబడితే ఫిలిం తొలగింపుతోపాటు జరిమానాను కూడా విధించనున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ రాము తెలిపారు.

ఉద్యానవనాలు ఏర్పాటు చేస్తాం

రామంతాపూర్,ఫిబ్రవరి 6 : ప్రతి కాలనీలో ఉద్యానవనాలు ఏర్పాటు చేస్తామని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ తెలిపారు. గురువారం ఎల్బీనగర్ జోన్ హార్టికల్చర్ డిప్యూ టీ డైరెక్టర్‌గా బాధ్యలు చేపట్టిన అన్నపూర్ణను ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలో శాలువాతోఘనంగా సన్మానించారు. అనంతరం డివిజన్‌లోని రాఘవేంద్రానగర్,బాలాజీనగర్ ఎన్‌క్లేవ్, అజ్మత్‌నగర్ తదితర ప్రాం తాల్లో ఆమెతోకలిసి పర్యటించారు. డివిజన్‌లోని పార్కుల్లో బెంచీలు ,గజబోలు, వాకింగ్ ట్రాక్ ఓపెన్ జిమ్,పిల్లల ఆటపరికరాలు,ఏర్పాటు చేయాలని డిప్యూటీ డైరెక్టర్ ను కోరారు. వెంటనే స్పందించిన ఆమె తగిన ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలోఅధికారులు నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు ఏదుల కొండల్‌రెడ్డి, శ్యామ్, బాలాజీ ఎన్‌క్లేవ్ సలహాదారు వేణుగోపాల్‌రెడ్డి, అధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి, అతిశేశి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

కౌమార మానసిక ప్రవర్తనపై సర్వే

విద్యార్థినులతో చర్చిస్తున్న తెలంగాణ సైకాలజిస్టుల సంఘం వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు

హయత్‌నగర్, ఫిబ్రవరి 6 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల చరిత్ర విభాగం, ఇబ్రహీంపట్నం సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ, మహిళా పీజీ కళాశాల సైకాలజీ విభాగం సమన్వయంతో హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌమార మానసిక ప్రవర్తనపై సర్వే నిర్వహించినట్లు కళాశాల అధ్యాపకులు గురువారం తెలిపారు. వెల్ బీయింగ్ స్కేల్, ఉలా లోన్లీనెస్ స్కేల్, రోసెన్ బర్గ్ సెల్ఫ్ ఎస్టీమ్ స్కేల్, బస్ పెర్రీ స్కేల్‌లను ఉపయోగించి ప్రశ్నాపత్రాలను తయారుచేసి కళాశాలలో విద్యార్థులకు, ఎన్‌సీసీ క్యాడెట్‌లకు అందించారు. తెలంగాణ సైకాలజిస్టుల సంఘం వైస్ ప్రెసిడెంట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు సర్వేను పర్యవేక్షించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్లు ప్రశ్నాపత్రాలు ముల్యాంకనం చేసి ఏప్రిల్‌లో ఫలితాలు వెల్లడిస్తారు. ఇబ్రహీంపట్నం సైకాలజీ విభాగం జ్యోతి, డాక్టర్ గంగాధర్, డాక్టర్ పి.నాగేంద్ర పాల్గొన్నారు.

గాయత్రీనగర్ కాలనీలో సీసీ రోడ్డుకు బీటలు

బీటలు వారిన నూతన సీసీ రోడ్డు

హయత్‌నగర్, ఫిబ్రవరి 6 : హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని గాయత్రీనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డుకు సరిపడా నీళ్లు పోయకపోవడంతో బీటలు వారింది. జీహెచ్‌ఎంసీ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సదరు కాంట్రాక్టర్ ఇష్టానుసారం కాలనీవాసులకు శాపంగా మారింది. సీసీ రోడ్డు నిర్మాణంలో సదరు కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో నిర్మించిన మరుసటి రోజునే పగుళ్లు ఏర్పడ్డాయి. పైగా మున్సిపల్, ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డుకు మధ్యలో ఉన్న చెట్టును అలాగే వదిలేయడంతో కాలనీకి వెళ్లే వాహనదారులు, బాటసారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

ముందుచూపులేని అధికారులు..

గాయత్రీనగర్ కాలనీకి వెళ్లేందుకు సీసీ రోడ్డును నిర్మించిన మున్సిపల్ అధికారులకు, సదరు కాంట్రాక్టర్‌కు సీసీ రోడ్డు మధ్యలో ఉన్న చెట్టును అలాగే వదిలేయడంతో వాహనాలు రాకపోకలు ఎలా సాగిస్తాయని స్థానికులు నిలదీస్తున్నారు. ఇలాంటి సీసీ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారే అవకాశముందని వారు అభిప్రాయపడుతున్నారు.

ప్రజాధనం వృథా..

జీహెచ్‌ఎంసీ నిధులు, ప్రజాధనం వృథా చేసేందుకు మున్సిపల్ అధికారులు, సదరు కాంట్రాక్టర్ తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించారని కాలనీవాసులు, స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి గాయత్రీనగర్ కాలనీలో నెలకొన్న నూతన సీసీ రోడ్డు సమస్యను పరిష్కరించి, సంబంధిత మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ప్రమాదం

సెల్లార్ మట్టి దిబ్బలు కూలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 6: జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే సెల్లార్ మట్టి దిబ్బలు కూలి ముగ్గురు మృతి చెందారని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ చంద్రపురికాలనీలో సెల్లార్ కూలిన ఘటనలో మట్టి దిబ్బల కింద పడి ముగ్గురు కూలీలు మృతి చెందిన ప్రదేశాన్ని గురువారం కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదానికి కారణమైన బిల్డర్‌తో పాటు భవన నిర్మాణ యజమానులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సెల్లార్‌ను అడ్డగోలుగా తవ్వడం వలనే పై భాగంలోని మట్టి దిబ్బలు కూలి పిల్లర్లలో కాంక్రీట్ నింపుతున్న ముగ్గురు వ్యక్తుల మరణానికి కారణమైందన్నారు. సెల్లార్ కింద భాగంలో గోడ మట్టిని లోతుగా తవ్వి తీయడం వలన పై భాగంలోని మట్టి దిబ్బలు పడి పోయాయన్నారు. సెల్లార్ తవ్విన కాంట్రాక్టర్ ప్రమేయంపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన ఒక్కొక్కరికి రూ. 25 లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లించి సదరు కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రపురికాలనీ సంక్షేమ సంఘం సభ్యులు వెంకట్‌రెడ్డి, సోమిరెడ్డి, బాపిరెడ్డి, నాయకులు హరీశ్‌రెడ్డి, రమేశ్‌చారి, పారంద సాయి పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు..

మన్సూరాబాద్: భవన నిర్మాణ పనుల కోసం వెళ్లిన సమయంలో సెల్లార్ మట్టి దిబ్బలు పడి ముగ్గురు మృతి చెందగా.. మరో వ్యక్తి గాయపడిన విషయం తెలిసిందే. ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు పాటించకుండా తమ కుటుంబసభ్యుల మృతికి కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఎల్బీనగర్ పోలీసులకు మృతుడు వీరయ్య పెద్ద కుమారుడు ఆలకుంట్ల శ్రీను ఫిర్యాదు చేశాడు. ఇదే విషయంపై బుధవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్ నెం. 3 అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భవన యజమానులు కుసుమ రమేశ్, కుసుమ విజయ, బిల్డర్ సిద్ధం సాయినాథ్, ఇంజినీర్ అభినయ్‌తో పాటు మరి కొందరి నిర్లక్ష్యం కారణంగా ముగ్గురు మృతి చెందారంటూ జీహెచ్‌ఎంసీ అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇరువురి ఫిర్యాదు మేరకు సంఘటనకు బాధ్యులైన వారిపై ఎల్బీనగర్ పోలీసులు ఐపీసీ 304ఏ, 337 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ సంఘటనలో గాయపడిన నల్గొండ జిల్లా, చింతపల్లి గ్రామానికి చెందిన ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. సెల్లార్ మట్టి దిబ్బలు పడి ఊపిరాడక చనిపోయిన ఆలకుంట్ల వీరయ్య, ఆలకుంట్ల రాము, ముద్దంగుల శ్రీనివాస్ మృతదేహాలకు గురువారం పోస్టుమార్టం పూర్తవ్వడంతో.. మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుల కుటుంబాలకు భవన నిర్మాణదారుడు నష్ట పరిహారం చెల్లించేందుకు అంగీకరించినట్లు సమాచారం.

డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 24వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 3వ తేదీ వరకు చెల్లించవచ్చని వివరించారు. ఈ పరీక్షలను ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ సోషియాలజీ (ఇంటర్నల్), ఎంఏ సోషియాలజీ (నాన్ ఇంటర్నల్), డేటా సైన్స్ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

బీఈడీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈ నెల 21వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో ఈ నెల 24వ తేదీ వరకు చెల్లించవచ్చని వివరించారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ అప్లైడ్ న్యూట్రిషన్, ఎమ్మెస్సీ స్పోర్ట్స్ న్యూట్రిషన్ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దూరవిద్య పీజీ జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే అన్ని పీజీ కోర్సుల పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ తెలిపారు. ఈ కోర్సు మొదటి, రెండో సంవత్సరం పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. ఈ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 15వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనాన్ని సవాల్ చేసేందుకు ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 7వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

వంతెనల నిర్మాణం పూర్తి చేస్తాం

నాచారంలో నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్

రామంతాపూర్,ఫిబ్రవరి 6 : నాచారం పెద్ద వంతెనపై రెండు వంతెనల నిర్మాణం త్వరలో పూర్తి చేస్తామని కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ స్పష్టం చేశారు. గురువారం డివిజన్‌లో అధికారులతో కలిసి వారు పర్యటించారు.పెద్ద వంతెనపై 8 వంతెనలు ఉన్నాయని,అందులో6పూర్తిఅయినాయని, రెండు వంతెనలు త్వరలో పూరి చేస్తామని, ఇందులో అంబేద్కర్‌విగ్రహం వద్ద వంతెనకు రూ.90 లక్షల నిధులు మంజూ రు చేయించామన్నారు. ఎవరికి ఇబ్బందులు కలుగకుండా పదిమీటర్ల వెడల్పుతో విశాలమై వంతెన నిర్మాణం జరగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఈఈ నాగేందర్,డిఈ బాలకృష్ణ, నాయకులు ము త్యంరెడ్డి, విట్టల్‌యాదవ్, కట్టబుచ్చన్నగౌ డ్, భూపాల్‌రెడ్డి, ఎర్రం శ్రీనివాస్‌రెడ్డి,దాసరి కర్ణ, నర్సింగ్‌రావు, భాను, అశోక్,హరి, ప్రసాద్, రెబల్‌రాజు,షేక్ రఫీక్, ఈశ్వర్,దానంకృష్ణ, మోహన్‌రెడ్డి, నాగరాజు, హరిబాబు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాలు పరిరక్షిస్తాం

చర్లపల్లి, ఫిబ్రవరి 6: కాప్రా మండలం పరిధిలోని ప్రభుత్వ స్థలాలను పరిరక్షించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ సుచరిత పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని చిన్న చర్లపల్లి నుంచి ఇందిరాగృహ కల్ప కాలనీకి వెళ్లే రహదారి, పరిసర ప్రాంతాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలపై సీపీఎస్ ఫిర్యాదు మేరకు గురువారం ఆమె అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ సుధీర్, రెవెన్యూ సిబ్బందితో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

డీఆర్డీవో ఎస్టేట్ యూనిట్ ఉత్తమ ప్రతిభ

షీల్డ్ అందుకుంటున్న డీఆర్డీవో ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ చీఫ్ ఇంజినీర్ షేక్ గౌస్ మొహిద్దీన్

సైదాబాద్, జనవరి 6: తెలంగాణ ప్రభుత్వ ఉద్యాన వన శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 8వ గార్డెన్ ఫెస్టివల్ 2వ అర్బన్ ఫార్మింగ్ ఫెస్టివల్-2024లో భాగంగా డీఆర్‌డీవో ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (ఆర్‌డీ) వివిధ అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చటంతో 40 బహుమతులు అందజేసిందని డీఆర్‌డీవో ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ చీఫ్ ఇంజనీర్ షేక్ గౌస్ మొహిద్దీన్ తెలిపారు. ఉద్యానవన శాఖ 2024 జనవరిలో నిర్వహించిన పోటీల్లో ఎంపిక చేశారని పలు అంశాల్లో ఉత్తమంగా నిలిచిన ఈ ఫెస్టివల్‌లో మొత్తం 40 బహుమతులు గెలుచుకోగా వాటిలో 26 ప్రథమ (బంగారు) బహుమతులు, 14 ద్వితీయ (వెండి) బహుమతులను గెలుచుకొన్నారు. ఆయన మాట్లాడుతూ అర్బన్ హార్టికల్చర్ టీం సభ్యుల శ్రమతోటు క్రమ శిక్షణ, పట్టుదల కారణంగా ఈ గొప్ప ఫలితాలు సాధించినట్లు ఆయన తెలిపారు. అదనంగా, డిఫెన్స్ విభాగంలో కూడా ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (ఆర్‌డీ) హైదరాబాద్‌కు ప్రత్యేక జ్యూరీ అవార్డు లభించిందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో జరిగిన బహుమతులు ప్రధానోత్సవంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉద్యానవన శాఖ సంచాలకులు యాస్మిన్ బాషా బహుమతులను అందజేశారని, అవార్డులను డీఆర్‌డీవో ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (ఆర్‌డీ) చీఫ్ ఇంజినీర్ కల్నాల్ దూబే, డీఆర్‌డీవో ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ చీఫ్ ఇంజినీర్ షేక్ గౌస్ మొహిద్దీన్ అందుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చర్లపల్లి, ఫిబ్రవరి 6: డివిజన్ పరిధిలోని ఆదర్శకాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతనిధులు కృషి చేయాలని చర్లపల్లి కాలనీల సమా ఖ్య అధ్యక్షుడు ఎంపెల్లి పద్మారెడ్డి కోరారు. డివిజన్ పరిధిలోని ఆదర్శకాలనీలో స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం కాలనీవాసులతో కలిసి ఆయన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలోని పార్కు నిరూపయోగంగా మారడంతో అసాంఘిక కార్యకలపాలకు నిలయంగా మారిందన్నారు. డ్రైనేజీ పొంగిపొర్లు తున్నా అధికారులు పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆయన అన్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నర్సింహ వంశరాజు, ముత్తు వంశరాజ్, గంప కృష్ణ, యావపురం రవి, బీవీ. నర్సింహారెడ్డి, ఉపేందర్, సింగిరెడ్డి నర్సింహారెడ్డి, కంచుగట్ల రాము, చిట్టిబాబు, గిరి,మహిళలు,కాలనీవాసులు పాల్గొన్నారు.

పార్కు స్థలంలో ఆందోళన చేపడుతున్న కాలనీవాసులు